సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం। 6 । సెప్టెంబర్ । 2025



హోరాహోరీగా ప్రచారం

కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. 8లో



తరలివస్తున్న గణనాథులు

భక్తి, శ్రద్ధలతో పూజలందుకున్న వినాయక ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు భద్రాచలం తరలిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతంగా మారే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రామభక్తుల మన్ననలు పొందాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఈఓ దామోదరరావు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసువావాలని, వారి మన్ననలు పొందాలని ఈఓ కె.దామోదర రావు సూచించారు. నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా శుక్రవారం దేవస్థానంలోని ప్రొవిజన్ స్టోర్, లడ్డూ ప్రసాదాల తయారీతో పాటు కౌంటర్లను ఆయన పరిశీలించారు. ప్రసాదాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రవణ్‌కుమార్, సాయిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ చైర్మన్ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'కారుణ్యం'లో గ్రేడ్‌-3 క్లర్క్ పోస్టులు

సింగరేణి యాజమాన్యం అంగీకారం

కొత్తగూడెంఅర్బన్: గని ప్రమాదాల్లో మృతి చెందిన ఉద్యోగుల వారసుల కోసం చేపట్టే కారుణ్య నియామకాల్లో పట్టభద్రులైన అభ్యర్థులను క్లరికల్ గ్రేడ్‌-3 పోస్టుల్లో నియమించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో యాజమాన్యం ద్వైపాక్షిక ఒప్పందం చేసుకుంది. 2009లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ చదివినవారు, డిప్లొమాలో మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ కోర్సులు చేసినవారితోపాటు డిగ్రీని కూడా అర్హతగా చేర్చారు. బాధిత కుటుంబాల్లో అర్హులైన టెక్నికల్ డిగ్రీ ఉన్న వారసులు లేనిపక్షంలోనే, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్న వారిని నియమించేలా నిర్ణయం తీసుకున్నారు. సంస్థలో గ్రేడ్‌-3 క్లర్కు పోస్టుల లభ్యత, కంపెనీ నిర్వహించే ప్రత్యేక పరీక్ష ఆధారంగా నియామకాలు చేపట్టనున్నారు. గ్రేడ్‌-3 క్లర్కు పోస్టుల అర్హత పరీక్షలో ఉత్తీర్ణులుకాని వారసులను కేటగిరీ-1లో జనరల్ అసిస్టెంట్‌గా గుర్తిస్తూ ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎంలు కవితా నాయుడు, వై.రఘురామిరెడ్డి, వెంకట రామిరెడ్డి, డి.వెంకటేశ్వర్లు, ఏజీఎం కె.అజయ్‌కుమార్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ కె.రాజ్‌కుమార్, నాయకులు మిర్యాల రంగయ్య, కె.సారయ్య, వైవీరావు, వంగా వెంకట్, ఎస్.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.350 కోట్లతో ప్రతిపాదనలు



భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామివారి ఆలయం

భద్రాచలం రామాలయ అభివృద్ధికి ప్రణాళిక
- విడతల వారీగా బడ్జెట్ కేటాయించాలని నివేదిక
- రామాలయ కొత్త మాస్టర్ ప్లాన్‌పై వైదిక కమిటీ కినుక..?

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ రూ.350 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఈ మేరకు ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ప్రాథమిక నమూనా సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో కలెక్టర్ ఆలయ అధికారులతోపాటు వైదిక కమిటీ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అభ్యంతరాలు, సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉంటుందని, ప్రధాన ఆలయంలో మార్పులు లేకుండా ఇతర అభివృద్ధి పనులు చేపతామని పేర్కొన్నారు.

నాలుగు విడతలుగా..

రామాలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధి నాలుగు విడతల్లో చేపట్టేలా నూతన నమూనాలో ప్రతిపాదనలు రూపొందించారు. తొలి విడతలో ఆలయ కాంప్లెక్స్ విస్తరణ పూర్తి చేయాలని ప్రతిపాదించారు. మండపాలు, క్యూ హాళ్లు, ప్రసాదం విభాగం, అడ్మినిస్ట్రేషన్ భవనాలు ఉన్నాయి. ఇందుకు రూ. 115 కోట్లు అవసరమని సూచించారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల అభివృద్ధిని రెండో విడతలో ప్రాధాన్యాంశాలుగా పేర్కొన్నారు. ఇందులో విస్తా కాంప్లెక్స్, అడ్మిన్ బ్లాక్, ఘాట్లు, రహదారులు ఉన్నాయి. ఈ పనులను రూ.35 కోట్లతో ప్రతిపాదించారు. మూడో విడతలో కరకట్టకు దిగువ భాగాన ఉన్న కాపా రామలక్ష్మమ్మ భూమిని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఇది గతంలో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండగా, సుదీర్ఘ కాలం కోర్టులో వాదనల అనంతరం రామాలయ సొంతమైంది. ఇందులో రామాయణ మ్యూజియం, తూము నర్సింహాదాసు ఆడిటోరియం, భక్త రామదాసు ప్లాజా, మల్టీ లెవల్ పార్కులు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదించారు. ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ అభివృద్ధి పనులకు నాలుగో విడతలో ప్రతిపాదించారు. హోటళ్లు, గిరిజన మ్యూజియం, రామవనం, పట్టణ సుందరీకరణ పనుల చేపట్టేలా పొందుపర్చారు. ఇందుకోసం రూ.100 కోట్లతో ప్రణాళిక రూపొందించారు. ఇలా మొత్తం రూ.350 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీన్ని సర్కారు ఆమోదించి తగిన బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంది.



ఆలయ అభివృద్ధి నూతన ప్లాన్‌పై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఆర్కిటెక్ట్(ఫైల్)

వైదిక కమిటీ అసంతృప్తి..?

కొత్త మాస్టర్ ప్లాన్‌పై ఆలయ వైదిక కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి తమను సంప్రదించకుండానే ప్లాన్ రూపొందించటంపై కినుక వహించినట్లు తెలుస్తోంది. గతంలో చినజీయర్ స్వామి సూచనతో ఆనంద సాయి రూపొందించిన ప్లాన్‌ను వీరు ఆమోదించారు. అయితే ప్రస్తుత ప్లాన్‌పై వీరు అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి భద్రాచలం పర్యటన సమయంలో వైదిక కమిటీ సలహాలను తప్పకుండా తీసుకోవాలని, వారి ఆమోదం తర్వాతే ప్లాన్‌ను ఫైనల్ చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే వైదిక కమిటీ, పండితులు, దేవాదాయ శాఖ అధికారులు సమష్టిగా ఈ ప్రణాళికను ఆమోదిస్తేనే ఆలయాభివృద్ధి కల సాకారం కానుంది. లేదంటే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశమే ఉండదు.

ఉత్తములకు అవార్డుల ప్రదానం

కొత్తగూడెంఅర్బన్: కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ భవిష్యత్‌కు మార్గనిర్దేశకులు అని పేర్కొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన చండ్రుగొండ మండలం గుర్రాయిగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.ప్రవీణను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, డీఈఓ నాగలక్ష్మి, చండ్రుగొండ ఎంఈఓ అభినందించారు. అనంతనం మిగతా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విత్తన సేకరణలో పాఠశాలలకు బహుమతులు

ఇల్లెందురూరల్/జూలూరుపాడు: విత్తన సేకరణలో జూలూరుపాడు హైస్కూల్ మండలస్థాయిలో ప్రథమ బహుమతి దక్కించుకుంది. శుక్రవారం కలెక్టర్ జితేష్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణలు రూ.5,000లు నగదు పురస్కారం, జ్ఞాపికను ఉపాధ్యాయులకు అందజేశారు. ఇల్లెందు మండలం ముత్తారపుకట్ట ప్రాథమిక పాఠశాలకు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కబ్బాకుల రవి, ఉమ, శాంతకుమారిలను అభినందించారు.

మణుగూరు ప్రిన్సిపాల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

మణుగూరు టౌన్: మణుగూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నల్లగడ్ల సత్యప్రకాశ్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రాణా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు మరింత కృషి చేస్తానని తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ సత్యప్రకాశ్



కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం ప్రవీణ

అస్తవ్యస్తంగా విద్యాశాఖ!

- ఇన్‌చార్జుల పాలనతో పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ
- అధికారులు, ఉద్యోగుల మధ్య అంతర్గత కుమ్ములాట
- సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులు



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: డీఈఓ సహా ఎంఈఓలు కూడా ఇన్‌చార్జిలే కావడంతో జిల్లా విద్యాశాఖలో పర్యవేక్షణ కొరవడింది. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో విద్యార్థులకు నష్టం జరిగే పరిస్థితి ఏర్పడింది. పాలన కూడా గాడితప్పుతోంది. గత నెలలో డీఈఓ వెంకటేశ్వరాచారి ఉద్యోగ విరమణ చేశారు. దీంతో జెడ్పీ సీఈఓకు ఇన్‌చార్జ్ డీఈఓ బాధ్యతలు అప్పగించారు. అప్పటికే గందరగోళంగా మారిన విద్యాశాఖ ఇన్‌చార్జిలతో అస్తవ్యస్తంగా తయారవుతోంది. విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయం కొరవడింది. కుమ్ములాటలు ఎక్కువ కావడంతో ఓ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు గురయ్యాడు.

ఇన్‌చార్జులే అధికం..

జిల్లా విద్యాశాఖలో డీఈఓ సహా ఎంఈఓలు అందరూ ఇన్‌చార్జులే. ప్రస్తుతం డీఈఓ నాగలక్ష్మి జెడ్పీ సీఈవోగా కూడా పని చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆమె ఎక్కువ సమయం ఎన్నికల విధులకే కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యాశాఖపై దృష్టి సారించడం కష్టమవుతోంది. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కరూ రెగ్యులర్ ఎంఈఓ లేరు. దీంతో పర్యవేక్షణ కుంటుపడుతోంది. ఎంఈఓలు పాఠశాలల హెచ్‌ఎంలుగా కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. హెచ్‌ఎం, ఎంఈఓ విధులతోపాటు పాఠ్యాంశాల బోధన కూడా చేయాల్సి ఉంటుంది. దీంతో వారిపై పనిభారం పడుతోంది. ఫలితంగా విద్యార్థులకు సరైన బోధన అందడంలేదు. అన్ని రకాల బిల్లుల్లో కూడా జాప్యం జరుగుతోంది. పదో తరగతి విద్యార్థులపై కూడా ప్రభావం పడుతోంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించలేదు. ప్రత్యేక తరగతుల్లో ఇచ్చే స్నాక్స్‌పై కూడా స్పష్టత లేదు. విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు పక్క జిల్లాల నుంచి రోజూ విధులకు వచ్చి వెళ్తున్నారు. సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారు. డీఈఓ కార్యాలయంలో చేతులు తడపందే పనులు కాని పరిస్థితి నెలకొంది. విద్యాశాఖను గాడిలో పెట్టేందుకు ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి రెగ్యులర్ డీఈఓను నియమించాలని లేదా ఖమ్మం తరహాలో అదనపు కలెక్టర్‌కు/విద్యాశాఖలోని అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

దరఖాస్తుదారులందరూ ఉత్తములేనా..?

విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్‌లోనే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జరగాల్సి ఉంది. కొరత ఉన్న పాఠశాలల్లో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి టీచర్లను సర్దుబాటు చేయాల్సి ఉంది. సబ్జెక్ట్ టీచర్ల కొరత లేకుండా చూడాలి. కానీ సెప్టెంబర్ వచ్చినా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జరగలేదు. జిల్లాలో ఈ సంవత్సరం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఆదర్శ బోధన పద్ధతులు అవలంబించేవారిని ఆధారాలతో గుర్తించి ఉత్తములుగా ఎంపిక చేయాల్సి ఉంది. కానీ దరఖాస్తుదారులందరినీ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గిరిజనులకు మత్స్యశాఖ రుణాలు

పాల్వంచరూరల్: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన స్కీమ్ కింద జిల్లాలోని గిరిజనులకు 90 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖాధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. జిల్లాలో తొలి విడతలో 130 గ్రామాల్లో గిరిజనులకు ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు, బోట్లు, రెండు ఎకరాల విస్తీర్ణంలో నీటి కుంటల నిర్మాణానికి నిధులు ఇస్తామని పేర్కొన్నారు. రుణాల్లో 90 శాతం సబ్సిడీపై ఉంటుందని తెలిపారు. ఆధార్, పాన్ కార్డు, గ్రామపంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ పత్రంతోపాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ రిపోర్టును జత చేసి జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గురువులదే గురుతర బాధ్యత

- ఐటీడీఏ పీఓ రాహుల్
- గిరిజన ఉపాధ్యాయులకు ఘన సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పీఓ రాహుల్ తదితరులు


భద్రాచలం: విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులేదని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గిరిజన భవన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాజీ రాష్ట్రపతి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కవిత రూపంలో సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యతోపాటు సామాజికంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 116 పాఠశాలలకు మెడికల్ కిట్లు అందించారు. పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. సన్మానం చేశారు. ఉద్దీపకం-2 రూపకల్పనలో సహకారం అందించినవారికి కూడా పురస్కారాలు ఇచ్చారు. బీఈడీ, డీఈడీ కళాశాలల్లో 100 శాతం ర్యాంకుల సాధనకు కృషి చేసిన లెక్చరర్లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మణెమ్మ, రమేష్, రాములు, అశోక్ కుమార్, చంద్రమోహన్, అలివేలు మంగతాయారు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 'కస్తూరి తిలకం'

మధిర: ఏపీలోని తెనాలిలో కళల కాణాచి సంస్థ ఆధ్వర్యాన ఈనెల 27 నుంచి అక్టోబర్ 2 వరకు జాతీయ స్థాయి పద్య నాటక పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మధిర కళాకారులు రూపొందించిన కస్తూరి తిలకం పద్య నాటకం ఎంపికైంది. ఈ నాటకాన్ని శారదాప్రసన్న రచించగా, డాక్టర్ సుబ్బరాజు దర్శకత్వంలో ప్రదర్శించనున్నారు. వివిధ పాత్రలను చిలువేరు శాంతయ్య, ఇనుపనూరి వసంత్, నరాల సాంబశివారెడ్డి, రాజేశ్వరరావు, తిరువూరు ప్రసాద్, కోటిరెడ్డి పోషిస్తారు. ఖమ్మం జిల్లా నుంచి రెండు నాటకాలను పరిశీలించగా కస్తూరి తిలకం ఎంపికైందని సుమిత్ర యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు తెలిపారు.

నేచర్ పార్కులో సౌకర్యాలు కల్పిస్తాం

పీసీసీఎఫ్ సువర్ణ



ఆళ్లపల్లిలో పర్యటిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ

పాల్వంచరూరల్/ఇల్లెందు రూరల్/గుండాల: ఇల్లెందు కోరగుట్ట చుట్టూ అటవీశాఖ తీర్చిదిద్దిన నేచర్ పార్క్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) సువర్ణ అన్నారు. ఇల్లెందు మండలం రొంపేడు అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్‌ను, కోరగుట్ట వద్ద నేచర్ పార్క్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని రేగళ్ల, ఆళ్లపల్లి, రంగాపురం ఏరియాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో ప్లాంటేషన్లు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలాలనిచ్చే మొక్కలు నాటాలని సూచించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన వాచ్‌టవర్‌ను ప్రారంభించారు. శనివారం కిన్నెరసాని డీర్ పార్కు, జలాశయం మధ్యలోని ఆనంద ద్వీపాన్ని సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ భీమా నాయక్, డీఎఫ్‌వో కిష్టాగౌడ్, ఎఫ్‌డీఓలు బాబు, కరుణాకరాచారి, ఎఫ్ఆర్ఓ చలపతిరావు, డీఆర్‌వోలు వెంకటరావు, వీరబాబు, ఎఫ్‌బీఓ సుజాత పాల్గొన్నారు.

ఆమోదిస్తే సవరణే...

- మార్కెట్ విలువతో పోలిస్తే భూమి రిజిస్ట్రేషన్ ధరలో హెచ్చుతగ్గులు
- దీన్ని సవరించేలా గత ఏడాది కమిటీల ఏర్పాటు
- ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించిన రిజిస్ట్రేషన్ల శాఖ
- సీఎం సూచనలతో అమలైతే ఉమ్మడి జిల్లాలోనూ ప్రభావం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: వ్యవసాయ, వ్యవసాయేతర భూముల మార్కెట్ విలువ సవరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. గత ఏడాది జూన్‌లో ధరల సవరణకు ప్రభుత్వం కమిటీలను నియమించింది. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ అధికారులతో ఏర్పాటైన ఈ కమిటీలు అన్ని జిల్లాలతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ భూముల విలువ సవరణకు ఉన్న అవకాశాలపై ప్రభుత్వానికి నివేదించారు. ఆతర్వాత ప్రక్రియ నిలిచిపోయింది. గతనెలలో ఓఆర్ఆర్ లోపల, వెలుపల 20 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లు, జీహెచ్ఎంసీ పరిధిలోనే విలువ సవరణ ప్రతిపాదనలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రూపొందించింది. కానీ రాష్ట్రమంతటా సవరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించడంతో గతేడాది పంపిన ప్రతిపాదనల మేరకు పెంచేలా కసరత్తు మొదలుపెట్టినట్లు సమాచారం.

రెండేసి కమిటీలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొన్నేళ్లుగా బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ ధరలతో పోలిస్తే బహిరంగ మార్కెట్ విలువ నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంది. గతంలో అత్యధిక ధర ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం మార్కెట్ విలువ స్తబ్దుగా ఉంది. వీటిని సవరించేందుకు గత ఏడాది జూన్‌లో కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామీణ కమిటీలకు ఆర్డీఓ చైర్మన్‌గా, తహసీల్దార్, ఎంపీడీఓ, మార్కెట్ వాల్యూ సబ్ రిజిస్ట్రార్లు సభ్యులుగా, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను కన్వీనర్‌గా ఉన్నారు. అర్బన్ కమిటీలకు అదనపు కలెక్టర్(రెవెన్యూ) చైర్మన్‌గా, జెడ్పీ సీఈఓ, మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్మన్లు సభ్యులుగా, స్థానిక సబ్ రిజిస్ట్రార్‌ను కన్వీనర్‌గా నియమించారు.

ప్రభుత్వానికి నివేదికలు

కమిటీలు పలు ప్రాంతాల్లో ధరల్లో తేడాలను పరిశీలించాయి. ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల విలువ సవరణ కోసం ప్రతిపాదనలను గత ఏడాది జులైలో ప్రభుత్వానికి పంపారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ప్రస్తుత మార్కెట్ విలువ, బహిరంగ మార్కెట్ విలువ ఆధారంగా కొన్నిచోట్ల పెంపు, ఇంకొన్ని చోట్ల తగ్గింపునకు ప్రతిపాదించారు. వీటి ప్రకారం ఖమ్మం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో భూ ధరలు భారీగా పెరిగే అవకాశముంది. కమర్షియల్ ప్రాంతాలను పక్కాగా గుర్తించి ధరలు పెంచేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సమర్పించారు.

పూర్తిస్థాయి పరిశీలన కోసం..

భూముల మార్కెట్ విలువ సవరణపై ప్రభుత్వానికి నివేదిక అందాక ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. అయితే, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించారు. ధరల పెంపు మరింత పారదర్శకంగా ఉండాలని, ఎక్కడా వ్యత్యాసాలు ఉండకూడదని ఆదేశించారు. దీంతో ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కర్ణాటకలో పరిశీలనకు ఓ కమిటీ వెళ్లగా.. అందులో జిల్లా రిజిస్ట్రార్ కూడా ఉన్నారు.

ప్రతిపాదనలకే సై...

ఉమ్మడి జిల్లాలో భూముల మార్కెట్ విలువ సవరణపై అందిన ప్రతిపాదనలను ఆమోదించే అవకాశముందని తెలుస్తోంది. తద్వారా ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతంలోని రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం, చింతకాని మండలం వందనం, కొణిజర్ల మండలం తనికెళ్ల, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ భారీగా పెరిగే అవకాశముంది. ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల ప్రభుత్వ, బహిరంగ మార్కెట్ ధర ఆధారంగా అన్నిరకాల భూముల ధరలు 50 శాతం వరకు పెరగొచ్చని భావిస్తున్నారు. కాగా, బహిరంగ మార్కెట్ ధరకు దగ్గరగా ఉన్న చోట మాత్రం యథావిధిగా కొనసాగించనున్నట్లు తెలుస్తోంది.

పలుచోట్ల ధరల పెంపు ప్రతిపాదనలు

→ **కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి :** నివాస ప్రాంతాల్లో గజం కనీస ధర రూ.300 నుంచి రూ.500కు, గరిష్ట ధర రూ.29,900 నుంచి రూ.32వేల మేర పెంపునకు ప్రతిపాదించారు.
- వాణిజ్య ప్రాంతాల్లో కనీస ధర రూ.1,700 నుంచి రూ.2 వేలకు, గరిష్ట ధర రూ.29,900 నుంచి రూ.32వేలకు పెంచాలని సూచించారు.
- అపార్ట్‌మెంట్లో చదరపు అడుగు ధరను రూ.1,300 నుంచి రూ.1,500కు, గరిష్ట ధర రూ.3వేల నుంచి రూ.3,200 పెంచొచ్చని తెలిపారు.
- వ్యవసాయ భూమి ఎకరా కనీస ధర రూ.2,25 లక్షల నుంచి రూ.4,లక్షలకు, గరిష్ట ధర రూ.52.50 లక్షల నుంచి రూ.55 లక్షలకు పెంచేలా ప్రతిపాదించారు.

→ **భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం :** నివాస ప్రాంతాల్లో గజం కనీస ధర రూ.500 నుంచి రూ.800కు, గరష్ట ధర రూ.7,800 నుంచి దానిని రూ.10వేలకు పెంచొచ్చని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.
- వాణిజ్య ప్రాంతాల్లో కనీస ధర రూ.4,800 నుంచి రూ.6 వేలకు, గరిష్ట ధర రూ.7,800 నుంచి రూ.15 వేలకు ప్రతిపాదించారు.
- అపార్ట్‌మెంట్లలో కనీస ధర రూ.1,300 నుంచి రూ.1,500కు పెంచాలని, గరిష్ట ధరను కొనసాగించాలని సూచించారు.
- వ్యవసాయ భూమి ఎకరా కనీస ధరను రూ.2,25 లక్షల నుంచి రూ.4లక్షలకు, గరిష్ట ధర రూ.2.25లక్షల నుంచి రూ.4లక్షలకు మించి పెంచేలా ప్రతిపాదించారు.

క్లుప్తంగా

కెమిస్ట్రీ అధ్యాపకుడికి డాక్టరేట్


గుగులోతు వీరన్న

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్రం అధ్యాపకుడు గుగులోతు వీరన్నకు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్లు వడ్డే రవీందర్, సీహెచ్.వెంకటరమణారెడ్డి పర్యవేక్షణలో ఆయన 'న్యూ పర్స్పెక్టివ్స్ ఇన్‌ట్రాన్సిషన్ మెటల్ క్యాటలిస్టు డిజైన్ సింథసిస్ అండ్ హోమోజీనియస్ ఆక్సిడేషన్ అండ్ ఇపాక్సిడేషన్' అంశంపై పరిశోధనాపత్రం సమర్పించారు. ఈమేరకు కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన వీరన్న డాక్టరేట్ అందుకోగా, ఎస్‌ఆర్‌ఎన్ బీజీఎన్‌ఆర్ ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, అధ్యాపకులు ఏఎల్.శాస్త్రి, ఎం.మాధవరావు, సీహెచ్.సుధాకర్, పి.సర్వేశ్వరరావు, ఎం.సునంద, సత్యవతి తదితరులు అభినందనలు తెలిపారు.

సంత వేలం.. రూ.6.63లక్షలు

కారేపల్లి సంతకు గత ఏడాది కంటే రూ.1.33లక్షలు అధికం


అధికారులకు నగదు చెల్లిస్తున్న మహేష్‌బాబు

కారేపల్లి: కారేపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యాన ప్రతీ ఆదివారం కొనసాగే సంత నిర్వహణను అప్పగించేందుకు శుక్రవారం వేలం నిర్వహించారు. నార్కట్‌పల్లికి చెందిన వెంకటేశ్వర్లు, కారేపల్లికి రాము, పండితాపురం గ్రామానికి చెందిన మేకల మహేష్‌బాబు యాదవ్, రాములు పాల్గొనగా ఏడా ది కాలానికి అత్యధికంగా రూ.6.63లక్షలకు పాడిన మహేష్‌బాబు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.5.30లక్షలు పలకగా ఈసారి రూ.1.33లక్షలు అధికంగా నమోదైంది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ నల్లమోతు శేషయ్య ఆధ్వర్యాన వేలం నిర్వహించగా సంత గుడి మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్‌తో పాటు వాసురెడ్డి సంపత్, మూడ్ మోహన్ చౌహాన్, జవ్వాజి రంగయ్య పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: మండలంలోని చిన్నగొల్లగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడిచేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, ఏడుగురు వ్యక్తులు పరారయ్యారు. మూడు ద్విచక్ర వాహనాలు, రూ.2,160 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

తరలివస్తున్న గణనాథులు

ఇప్పటికే దూరప్రాంతాల నుంచి భద్రగిరికి వినాయక ప్రతిమలు

- నేడు జిల్లావ్యాప్తంగా విగ్రహాలను నిమజ్జనానికి తరలించనున్న భక్తులు
- పోలీసు, ఇరిగేషన్, రెవెన్యూ, పీఆర్, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు




గోదావరి తీరంలో వినాయక విగ్రహాలు

భద్రాచలంఅర్బన్: భక్తి, శ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులను గంగమ్మ ఒడికి తరలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా శనివారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం భద్రాచలం గోదావరి వద్ద పోలీసు, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ బందోబస్తు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నదిలో గతేడాది 1,300 గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయగా, ఈసారి జిల్లావ్యాప్తంగా 2 వేల ప్రతిమలు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 729 విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. భద్రాచలంలో ప్రతిష్టించిన అధిక శాతం వినాయక ప్రతిమల నిమజ్జనం మొదలుకాగా, రెండు, మూడు రోజులుగా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వినాయక విగ్రహాలను తీసుకొస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలతోపాటు సమీప జిల్లాల నుంచి భక్తులు తీసుకొచ్చే వినాయక విగ్రహాల నిమజ్జనం శని, ఆదివారాల్లో కొనసాగనుంది. భద్రాచలంలోని మండపాల వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించాక గణపతి బప్పా మోరియా అంటూ నిమజ్జనానికి శోభాయాత్రగా బయలుదేరారు. శోభాయాత్ర వీక్షణకు భక్తులు బారులుదీరడంతో పట్టణంలోని రహదారులు, గోదావరి కరకట్ట వద్ద రద్దీ నెలకొంది. భక్తులు తీసుకొచ్చిన విగ్రహాలను గోదావరి తీరంలో దించి.. ఆ తర్వాత వరుస క్రమంలో క్రేన్ల ద్వారా లాంచీల్లో ఎక్కించి గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నదిలోకి విగ్రహాలను తీసుకెళ్లేలా పడవలను సమకూర్చి గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు.

మొదటిసారి భద్రాచలం వచ్చాం



మాది హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్. రాధేకృష్ణ యూత్ ఆధ్వర్యంలో వినాయకుడికి పూజలు నిర్వహించి భద్రాచలం వద్ద గోదావరిలో నిమజ్జనం చేసేందుకు వచ్చాం. మా చేతులతో నిమజ్జనం చేయాలని అనుకున్నాం. కానీ పోలీసుల సూచనలతో సిబ్బందికి విగ్రహాన్ని అప్పగించాం. మేము నాలుగేళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడుసార్లు హైదరాబాద్‌లోనే నిమజ్జనం చేశాం. ఈసారే భద్రాచలం వచ్చాం.

– పాండురంగ, రాధేకృష్ణ యూత్, హైదరాబాద్


గోదావరిలో నిమజ్జనానికి లాంచీపై తరలిస్తున్న వినాయక విగ్రహాలు


భారీ గణనాథుడిని క్రేన్ ద్వారా తరలిస్తున్న సిబ్బంది

హోరాహోరీగా ప్రచారం

- ఈ నెల 10న కేటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ఎన్నికలు
- రాజకీయ పార్టీల తరహాలో హంగూ ఆర్భాటాలు


కేటీపీఎస్ కాలనీలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు

పాల్వంచ: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ(పాల్వంచ) ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఈ నెల 10న ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 3,008 ఓట్లు ఉండగా, గెలుపే లక్ష్యంగా ఎవరికీవారు పావులు కదుపుతున్నారు. రాజకీయ పార్టీల తరహాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. 13 డైరెక్టర్ పోస్టులకు 46 మంది నామినేషన్లను సమర్పించారు. ముగ్గురు రెండుసార్లు సమర్పించడంతో స్క్రూటినీలో తొలగించారు. ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలో 37 మంది మిగిలారు. గురువారం గుర్తులు కేటాయించడంతో అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచార హోరు సాగిస్తున్నారు. భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. కర్మాగారంలో వివిధ విభాగాల్లో పర్యటిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కార్మికుల ఇంటింటికీ తిరిగి ఓటు వేయాలని కోరుతున్నారు.

మూడు చోట్ల పోలింగ్

ఈ నెల 10న మూడు కర్మాగారాల్లో ఓటింగ్ జరగనుంది. కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో మూడు బూత్‌లు, బీటీపీఎస్(మణుగూరు)లో రెండు బూత్‌లు, వైటీపీఎస్(దామరచర్ల, నల్లగొండ)లో రెండు బూత్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం పాల్వంచలో ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

ప్రచారానికి రూ. లక్షల్లో ఖర్చు

అభ్యర్థులు ప్రచారానికి రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని కాలనీలు, కర్మాగారాల పరిసరాలు, కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సామాజిక వర్గాల వారీగా ఓట్లు రాబట్టుకునేందుకు మూడు రోజులుగా మద్యం పార్టీలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కార్మికులతో బేరసారాలు సాగిస్తూ ఎన్నికల ముందు రోజు నగదు పంచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు సైతం విధులకు డుమ్మా కొట్టి ఇష్టారాజ్యంగా బయట తిరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కరకగూడెం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై శుక్రవారం మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి విచారణ చేపట్టారు. చిరుమళ్ల గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర భార్య చందా భారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కరకగూడెం మండల కేంద్రంలోని ఆమెకు చెందిన పట్టా భూమిని కొందరు వ్యక్తులు ట్రాక్టర్‌తో దున్నిన ఘటనలో కేసు నమోదుకాగా, డీఎస్పీ విచారించారు. బాధితురాలు, కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఘటనాస్థలిని పరిశీలించి, సాక్షులను విచారించారు. ఈ కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నిక

అధ్యక్ష,కార్యదర్శులుగా పవన్ కుమార్, మహేష్


అసిస్టెంట్ ఇంజనీర్ల అసోసియేషన్ నూతన కమిటీ

పాల్వంచ: టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ సంస్థల పరిధిలోని అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఫలితాలు శుక్రవారం వెల్లడించారు. కేటీపీఎస్ కాలనీలోని ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో ఎలక్షన్ ఆఫీసర్ బి.రవికుమార్ ఆధ్వర్యంలో కౌంటింగ్ నిర్వహించారు. అసోసియేషన్‌లో సుమారు 2,500 మంది సభ్యులు ఉండగా, ఈ నెల 2న రాష్ట్రంలో సుమారు 25 చోట్ల పోలింగ్ నిర్వహించారు. మొత్తం 1,814 ఓట్లు పోలయ్యాయి. 14 సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరగడం విశేషం. అధ్యక్షుడిగా గువ్వల పవన్‌కుమార్ (ట్రాన్స్‌కో), జనరల్ సెక్రటరీగా తాళ్లపల్లి మహేష్(జెన్‌కో–కేటీపీఎస్), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.కుమారస్వామి, అడిషనల్ జనరల్ సెక్రటరీగా కె.రామకృష్ణ ఎన్నికయ్యారు. వీరితోపాటు ఎం.చందు, జి.శ్రీపాల్ రెడ్డి, కె.వెంకటేష్, ఆర్‌సీ, భరత్‌కుమార్, వి.మహిపాల్, డి.వంశీ, హెచ్.రంజిత్ రెడ్డి, ఆర్.కిరణ్, డి.మహేష్, జి.శ్రీకాంత్, కె.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.నాగేంద్ర, దయానంద్, టి.సందీప్ రెడ్డి, ఎ.శ్రీకాంత్, ఎ.శ్రీనివాస్, పి.రజినికాంత్, బి.నరేష్, శ్రీకాంత్, వై.శ్రావణ్‌కుమార్, తుమ్మల నవీన్, ఎం.దిలీప్ కుమార్, సీహెచ్.నవీన్ కుమార్‌లు వివిధ పోస్టులకు పోటీ చేసి విజయం సాధించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఏఈల సమస్యల పరిష్కారానికి కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం స్వీట్లు పంచుకుని సంబురాలు నిర్వహించారు.

రూ.15.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ


కరెన్సీ నోట్లతో అలంకరించిన వినాయక మండపం

పాల్వంచ: పట్టణంలోని గట్టాయిగూడెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని శుక్రవారం రూ.15.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో గణనాథుడిని సందర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మారెడ్డి, జ్యోతి, శ్రీకాంత్, మహేశ్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

'స్వగృహ' మాకే కావాలి!


ప్రస్తుతం రాజీవ్ స్వగృహ బ్లాక్‌లు


అభివృద్ధి తర్వాత ఇలా..

- ఫ్లాట్ల కోసం వ్యాపారుల పోటాపోటీ
- ఇప్పటికే కొనుగోళ్లకు ఉద్యోగుల నిర్ణయం
- అన్నీ సవ్యంగా ఉండడంతో వ్యాపారుల దృష్టి

ఖమ్మం సహకారనగర్: ఎన్నో ఏళ్ల అనంతరం సొంత ఇంటి కల నెరవేరుతుందనే ఆశతో ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా... వారి ఆశలను అడియాసలు చేసేలా కొందరు వ్యాపారులు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో ఏళ్ల క్రితం రాజీవ్ స్వగృహ పేరిట నిర్మాణం మొదలుపెట్టిన అపార్ట్‌మెంట్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఆతర్వాత ఎవరూ పట్టించుకోలేదు. సుమారు ఏడేళ్లుగా ఉన్నవి ఉన్నట్లుగా తమకు కేటాయిస్తే మిగతా నిర్మాణం చేసుకుంటామని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, చివరకు ముఖ్యమంత్రిని సైతం కలిశారు. ఈ వినతిపై ఇటీవలే స్పందన రావడంతో ఒక్కో అడుగు ముందుకు పడుతుండగానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలోకి దిగడం వారిని ఆందోళనకు గురిచేస్తోందని సమాచారం.

హౌసింగ్ పీడీ పరిశీలన

రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను ఉద్యోగులకు నిర్ణీత ధరతో కేటాయించేందుకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చింది. దీంతో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన సమావేశమై ఫ్లాట్ల ధర చదరపు అడుగుకు రూ.1,150గా నిర్ణయించారు. అదే అభివృద్ధి చేశాక రూ.2,500గా ఖరారు చేశారు. అభివృద్ధి తర్వాత రాజీవ్ స్వగృహ ప్రాంగణం ఎలా మారనుందో బ్రోచర్లు ముద్రించారు. ఈక్రమంలోనే హౌసింగ్ పీడీ వీ.పీ.గౌతమ్ ఇటీవల పరిశీలించి సూచనలు చేశారు. ఆపై ఖమ్మం కలెక్టర్ అనుదీప్ కూడా సమీక్షించి రాజీవ్ స్వగృహ ప్రాంగణాన్ని ఉన్నది ఉన్నట్లుగా తెలంగాణ ఉద్యోగుల హౌస్ బిల్డింగ్ సొసైటీకి కేటాయిస్తామని ప్రకటించారు.

తొలి దఫాగా రూ.5కోట్లు

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కోసం తొలిదశలో ప్రభుత్వానికి రూ.5కోట్లు చెల్లించాల్సి ఉండడంతో నగదు సేకరణలో ఉద్యోగ సంఘాలు నిమగ్నమయ్యాయి. అలాగే, ఖమ్మం కలెక్టర్ సమీక్ష సందర్భంగా మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నందున వరద నుంచి ఎలాంటి ముప్పు ఉండదని, బఫర్ జోన్ కాకపోవడంతో భవిష్యత్‌లోనూ ఇబ్బందులు ఉండవని తెలిపారు. దీంతో ఉద్యోగులు ఫ్లాట్లు బుక్ చేసుకునేందుకు ఆసక్తి కనబరిచారు.

అప్పుడు వద్దు.. ఇప్పుడు కావాలి

గతంలో రెండు సార్లు రాజీవ్ స్వగృహను వేలం వేయగా ఏ ఒక్క వ్యాపారి ముందుకు రాలేదు. కనీసం టెండర్లు కూడా దాఖలు చేయలేదు. కానీ మున్నేటికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తుండడం, నిర్మాణ ప్రాంతం బఫర్ జోన్ పరిధిలోకి రాదని ఏకంగా ఖమ్మం కలెక్టర్ ప్రకటించడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముందుకొస్తున్నట్లు సమాచారం. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన నిర్మించిన బ్రోచర్లు కూడా ఆకట్టుకునేలా ఉండడంతో వ్యాపారులే సముదాయాన్ని దక్కించుకుని అభివృద్ధి చేశాక అధిక ధరలో అమ్ముకోవాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. అయితే, ఏళ్ల అనంతరం సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో ఉన్న ఉద్యోగులు ఈ ప్రచారంతో ఆందోళన చెందుతుండగా.. ఎవరూ స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

రాజీవ్ స్వగృహ వివరాలు

స్థలం	9.22ఎకరాలు
ఫ్లాట్లు	576
అంతస్తులు	09
బ్లాక్‌లు	08
2 1/2 బెడ్ రూమ్‌లు ఫ్లాట్లు	288
3 బెడ్ రూమ్	288

విద్యుదాఘాతంతో ఆపరేటర్ మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న బీబీఆర్ రైస్‌మిల్లులో గురువారం రాత్రి ఆపరేటర్ పోలు రమేష్ (45) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రైస్ మిల్లులో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్ సీసీ కెమెరాలను సరిచేసేందుకు మిల్లు పైభాగానికి చేరుకున్నాడు. తీగలు కత్తిరించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. దీంతో తోటి కార్మికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కార్మిక సంఘాల నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు, సుభాష్‌నగర్ ప్రాంత పెద్దలు రైస్‌మిల్లు యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఆపరేటర్ కుటుంబానికి రూ.20 లక్షలు పరిహారంగా చెల్లించేందుకు రైస్ మిల్లు యాజమాన్యం అంగీకరించింది. భవిష్యత్తులో రావాల్సిన ఇన్సూరెన్స్, పీఎఫ్ నిధులు సకాలంలో అందేలా సహకరిస్తామని యాజమాన్యం కార్మిక సంఘాల నాయకులకు హామీ ఇచ్చింది.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

- పుట్టింటికి వచ్చిన సమయంలో ప్రమాదం

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్ కాల్వకట్ట ప్రాంతానికి చెందిన సాయిప్రియ(25)కు నాలుగేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన దాసోజు మణికంఠతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, అనారోగ్యంతో బాధపడుతున్న బంధువును చూడడానికి గత నెల 29వ తేదీన సాయిప్రియ ఖమ్మం వచ్చింది. ఈక్రమంలో గురువారం సాయంత్రం డాబాపై బట్టలు ఆరవేస్తుండగా ఇనుప తీగకు విద్యుత్ తీగలు తాకడంతో కరెంట్ సరఫరా అయింది. ఈమేరకు షాక్‌కు గురైన ఆమెను తల్లిదండ్రులు పాండురంగాచారి, దుర్గ జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

నిమజ్జనానికి వెళ్లిన యువకుడి గల్లంతు..

ముదిగొండ: వినాయకుడి నిమజ్జనానికి వెళ్లిన యువకుడు గల్లంతైన ఘటన ముదిగొండ మండలం మాదాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. మాదాపురం గ్రామానికి చెందిన పడిసల సైదారావు(24) వినాయక శోభాయాత్ర, నిమజ్జనంలో పాల్గొన్నారు. ఆయన మాదాపురం చెరువు వద్ద నిమజ్జనం పూర్తయ్యాక స్నానం కోసం చెరువులోకి దిగాడు. ఈక్రమాన ప్రమాదవశాత్తు గల్లంతవడంతో స్థానికులు ఎంత సేపు గాలించినా సైదారావు ఆచూకీ తెలియ రాలేదు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేయగా, పోలీసులు వివరాలు సేకరించారు.

ఇకపై పీఏసీఎస్‌ల ద్వారానే..

- డీలర్ల ద్వారా యూరియా పంపిణీ నిలిపివేత
- రైతుల ఇబ్బందుల నేపథ్యాన ప్రభుత్వ నిర్ణయం
- ఇప్పటికే పాలేరు నియోజకవర్గంలో అమలు


పందిళ్లపల్లి రేక్ పాయింట్ వద్ద యూరియా పంపిణీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: యూరియా పంపిణీని పూర్తిగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 40 శాతం మేర డీలర్ల ద్వారా, మిగతా పీఏసీఎస్‌ల ఆధ్వర్యాన పంపిణీ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసే యూరియాకు ఈసారి కొరత ఏర్పడగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యాన పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేస్తేనే ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకత ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, పాలేరు నియోజకవర్గంలో ఇప్పటికే ఈ విధానం అమలవుతుండగా, మిగతా ప్రాంతాల్లోనూ అమలుచేయనున్నారు.

డీలర్లకు నిలిపివేత

ప్రస్తుతం ఖమ్మం జిల్లాలోని 500 డీలర్లకు యూరియా సరఫరాను పూర్తిగా నిలిపివేయనున్నారు. ఇకపై పూర్తిగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా పంపిణీ జరుగుతుంది. పీఏసీఎస్‌లకు దూరంగా ఉన్న గ్రామాల్లో సబ్ సెంటర్లను ఏర్పాటు చేసి యూరియా పంపిణీ చేస్తారు. పాలేరు నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న ఈ విధానాన్ని జిల్లాలోని 76 పీఏసీఎస్‌ల పరిధిలో అమలుకు నిర్ణయించారు. ఇందుకోసం సహకార సంఘాలకు తోడు మరో 55 సబ్ సెంటర్లు ఏర్పాటు చేస్తారు. మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో ఏఈఓల ద్వారా కూపన్లు జారీ చేయనుండగా, పీఏసీఎస్‌ల సీఈఓలు, ఉద్యోగులు యూరియా అందిస్తారు.

మరో రెండు వ్యాగన్ల యూరియా

పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు రెండు రోజుల్లో రెండు వ్యాగన్ల యూరియా రానుందని ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ఒక్కో వ్యాగన్‌లో 2,600 మెట్రిక్ టన్నుల యూరియా ఉంటుందని పేర్కొన్నారు. ఈ యూరియాను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు సరఫరా చేస్తామని తెలిపారు. కాగా, శుక్రవారం ఉమ్మడి జిల్లాకు 1,333 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఇందులో ఖమ్మం జిల్లాకు 483, భద్రాద్రి జిల్లాకు 500, మహబూబాబాద్ జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల చొప్పున కేటాయించామని వెల్లడించారు.